క్లుప్తంగా

గంగమ్మకు ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు మజరా గ్రామమైన మూడురాళ్లపల్లెలో వెలసిన గ్రామ దేవత గంగమ్మ జాతర సందర్భంగా ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి సోదరులు ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ నాయకుడు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో వారికి ఘన స్వాగతం లభించింది. కార్యక్రమంలో ఇరిగెల విశ్వనాథ్‌రెడ్డి, ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి, ఇరిగెల ప్రతాప్ రెడ్డి, కన్వీనర్ జి.కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, మనోహర్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల లయన్స్ క్లబ్ 2023–24 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక బాలాజీ కల్యాణ మండపంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎన్నికల కమిటీ సభ్యులు డాక్టర్ సహదేవుడు, రవికృష్ణ, ఏవీఆర్‌ప్రసాద్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా పీవీ సుధాకర్‌రెడ్డి, కార్యదర్శిగా సోమేసుల నాగరాజు, కోశాధికారిగా నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు. ఉపాధ్యక్షులుగా పోసిన సుబ్బారావు, ఉపేంద్రనాథరెడ్డి, షావలిరెడ్డి, కూరప్రసాద్, ఎలిశెట్టి రత్నాకర్, సీనియర్ సభ్యులను బోర్డు ఆఫ్ డైరెక్టర్స్‌గా వివిధ కార్యక్రమాల కమిటీ చైర్మన్లుగా ఎన్నుకున్నారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, ఏవీఆర్‌ప్రసాద్, సహదేవుడు, క్లబ్ సభ్యులు ఆంజనేయులు, శ్రీకాంత్, రవి ప్రకాష్, కొశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణే ధ్యేయం

నంద్యాల(అర్బన్): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే పునరుద్ధరణే ధ్యేయంగా ముందుకు సాగాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయపులి కొండన్న తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఎంవీఆర్‌పీఎస్ నూతన నియోజకవర్గ, పట్టణ కమిటీల ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జయరాం పాల్గొన్న సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కాశన్నను ఎన్నుకున్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లాలుస్వామి, నాయకులు నాగేశ్వరరావు, మదనగోపాల్, పరమేష్, రఘురాం, సవారీ పాల్గొన్నారు.

ఆటో బోల్తా..ఇద్దరికి గాయాలు

రుద్రవరం: మండలంలోని తిప్పారెడ్డిపల్లె సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆళ్లగడ్డ నుంచి రుద్రవరానికి ప్రయాణికులతో వస్తున్న ఆటోపై చెట్టు కొమ్మ విరిగి పడటంతో ఆటో పల్టీ కొట్టింది. ఆ ప్రమాదంలో ఆటో డ్రైవర్ లింగమూర్తి, సుమ అనే ప్రయాణికురాలు గాయపడ్డారు. మిగిలి ఉన్న వారు క్షతగాత్రులను రుద్రవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దర్గా నిర్మాణ విషయంలో ఘర్షణ

రుద్రవరం: మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో దర్గా నిర్మాణ విషయంలో ఆదివారం ఇరువర్గాల వారు ఘర్షణ పడగా నలుగురికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో ఉండే ఓ దర్గాలో కుల మతాలకు అతీతంగా ఫాతెహాలు చేస్తారు. ఆ దర్గాను పునర్నిర్మిద్దామని గ్రామస్తులు తీర్మానించారు. అయితే నిర్మాణ సమయంలో వాడాల్సిన వస్తు సామగ్రి విషయంలో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకొని ఘర్షణకు దారి తీసింది. అనంతరం ఇరువర్గాలు రుద్రవరం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ముందు గాయాలకు చికిత్స చేయించుకోవాలని పోలీసులు చెప్పడంతో ఓ వర్గం వారు 108లో నంద్యాలకు, మరో వర్గం వారు సొంత వాహనంలో ఆళ్లగడ్డ వైద్యశాలకు వెళ్లారు. ఎస్‌ఐ శరత్ కుమార్‌రెడ్డిని వివరణ కోరగా.. ఫిర్యాదులు అందగానే కేసు నమోదు చేసి విచారణ చేపడతామని చెప్పారు.

జీనేపల్లెలో ఉచిత వైద్య శిబిరం

శిరివెళ్ల: జీనేపల్లెలో గ్రామ సర్పంచ్ దగడ రాజేశ్వరి ఆధ్వర్యంలో నంద్యాల రోటరీ క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారంనిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దగడ గుర్రెడ్డి జ్ఞాపకార్థం శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ, క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అనిల్‌కుమార్ ప్రారంభించారు. శిబిరంలో చెవి, ముక్కు, గొంతు, చర్మవ్యాధి, గుండె, జనరల్ ఫిజీషియన్, నెఫ్రాలజిస్ట్, ఎముకలు, కీళ్ల వైద్యులు, కంటి వైద్యులు, స్త్రీల వైద్య నిపుణులు, గ్యాస్ట్రో నిపుణులు 650 మందికి వైద్యసేవలు అందించారు. రూ.70వేలు విలువ చేసే మందులను ఉచితంగా అందజేశారు. దగడ రాజారెడ్డి, రఘునాథరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు చీమల అనూష, రామచంద్రారెడ్డి, మాజీ రోటరీ క్లబ్ గవర్నర్ కల్లూరు రామలింగారెడ్డి పాల్గొన్నారు.

గొప్ప నిర్ణయం



ఇక్కడ చికిత్స పొందుతున్న మహిళ పేరు రామసుబ్బమ్మ. దొర్నిపాడు గ్రామానికి చెందిన ఈమె మూడు సంవత్సరాలుగా గర్భసంచి క్యాన్సర్‌తో బాధపడుతోంది. ప్రస్తుతం వ్యాధి నాలుగో స్టేజిలో ఉంది. దీంతో ఈమెను ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుని తీసుకురావాలంటే చాలా ఇబ్బందితో పాటు ఖర్చు అధికంగా అవుతుంది. 'ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యులు ఇంటి వద్దకే వచ్చి కదలలేక మంచంలో ఉన్న నాకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన కొన్ని రకాల మందులు ఇచ్చారు. రోజూ నర్సు వచ్చి బాటిళ్లు పెడుతున్నారు. మాలాంటి వారికి ఇలా ఇంటికే వచ్చి సేవలందించడం గొప్ప విషయం

– రామసుబ్బమ్మ, దొర్నిపాడు



కిష్టిపాడులో మంచానికే పరిమితమైన చిన్నారి స్వరూపకు ఇంటి వద్ద వైద్య పరీక్షలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్

ఇంటికి వచ్చి.. వైద్యం చేసి

- 'ఫ్యామిలీ ఫిజీషియన్' వైద్య సేవలకు విశేష ఆదరణ
- పల్లెల్లో విస్తృతంగా ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ సేవలు
- నెలలో రెండు సార్లు వైద్య పరీక్షలు

ఆళ్లగడ్డ: సంపన్నులకే పరిమితమైన ''ఫ్యామిలీ డాక్టర్'' ఇప్పుడు పేదలకూ చేరువవుతున్నారు. పేద కుటుంబాలు ఇంటి వద్దే ఉచితంగా వైద్య సేవలు అందుకుంటున్నారు. నడవలేని వృద్ధులు, మంచానికే పరిమితమైన, దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అమలు చేస్తుండటంతో వారందరికీ వైద్యులు, సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్న సేవలకు విశేష ఆదరణ లభిస్తోంది.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు భరోసా..

సహజంగా గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబంలో ఏ ఒక్కరికి జబ్బు చేసినా ఒకే వైద్యుడి వద్దకు వెళ్తుంటారు. క్రమం తప్పకుండా ఒకే డాక్టర్ వద్దకు వెళ్తుండటం వల్ల పేషెంట్‌పై ఆ డాక్టర్‌కు అవగాహన ఏర్పడుతుంది. రోగుల శరీర తత్వం, జబ్బులు, వాడుతున్న మందులపై పూర్తి అవగాహన ఉంటుంది. వారు సమస్యతో వెళ్తే గతంలో ఉన్నవాటితో పాటు ప్రస్తుత సమస్యను తెలుసుకొని చికిత్స చేయడం సులభమవతుంది. ఇలాంటి విధానాన్ని ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ పేరుతో అములులోకి తీసుకొచ్చింది.దీంతో బాలింతలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మరింత భరోసా దక్కినట్లైంది.



విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రోగులను పరీక్షించి మందులు అందజేస్తున్న దృశ్యం

నెలకు రెండు సార్లు వైద్య పరీక్షలు..

పీహెచ్‌సీల్లోని ఇద్దరు వైద్యాధికారుల్లో ఒకరు ప్రతి నెల రెండుసార్లు 104 వాహనంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు వెళ్లి రోగులను పరీక్షిస్తారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తిస్తారు. ఎవరెవరికి ఏయే పరీక్షలు చేయాలో నిర్ధారించి సేవలు అందిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సచివాలయం వద్ద వైద్య సేవలు అందిస్తారు. తమ వద్దకు రాలేని మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు సాయంత్రం వెళ్లి వైద్యం అందిస్తారు. రోగికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

14 రకాల పరీక్షలు.. 67 రకాల మందులు

ఫిజీషియన్ సూచన మేరకు 14 రకాల వైద్య పరీక్షలు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో నిర్వహిస్తారు. ఇందుకు అవసరమైన ర్యాపిడ్ కిట్లు, మందులు అందుబాటులో ఉంచారు. . వివిధ కంపెనీలకు చెందిన 67 రకాల మందులు సిద్ధంగా ఉంచారు.

రెండు వారాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు ఇలా..

ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపులు	381
వైద్యసేవలు అందుకున్న వారు	18,230
సాధారణ ఔట్ పేషెంట్లు	5,853
జ్వరం కేసులు	4,500
పరీక్షలు చేయించుకున్న గర్భిణులు	568
పరీక్షలు చేయించుకున్న బాలింతలు	489
రక్తహీనత బాధితుల సంఖ్య	286
అసంక్రమిక వ్యాధుల (బీపీ, షుగర్ మొదలైన) పరీక్షలు	5,788

- నియోజకవర్గంలో 104 వాహనాలు – 5
- గ్రామాలకు వెళ్లి సేవలు అందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్లు – 12
- సిబ్బంది – 30
- రోజుకు సగటున పరీక్షలు చేయించుకుంటున్న వారు – 1,200

దేశంలో ఎక్కడా లేని విధంగా..



గ్రామీణ పేదల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చింది. గ్రామాల్లో దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు, గర్భిణులు, బాలింతల ఇంటి వద్దకే వెళ్లి డాక్టర్ సేవలు అందించే వ్యవస్థను తీసుకురావడం మంచి పరిణామం. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం ఆరోగ్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం

– డాక్టర్ నాగేంద్ర, ఫ్యామిలీ ఫిజీషియన్, దొర్నిపాడు

విద్యుత్ సమాచారం

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం,ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ స్పష్టం చేశారు.

జగనన్న సురక్షను సక్రమంగా నిర్వహించాలి

గోస్పాడు: గ్రామాల్లో ప్రజలకు అవసరమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకాన్ని సక్రమంగా నిర్వహించేలా చూడాలని ఎంపీడీఓ భాస్కర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శేఖర్ సూచించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ధ్రువ పత్రాలు అందించేందుకు వలంటీర్ ఇంటింటికీ తిరిగి నమోదు చేయాలని తెలిపారు. కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, కుటుంబ సభ్యుడి ధ్రువ పత్రాలతో పాటు, మ్యూటేషన్ లావాదేవీలు, ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానం, పంట సాగు హక్కు కార్డు వంటి ధ్రువ పత్రాలు ఈ కార్యక్రమం ద్వారా అందజేయనున్నట్లు చెప్పారు. వీటికోసం వచ్చే నెల 1వ తేదీ నుంచి గ్రామాల్లో ప్రత్యేకంగా మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో రెండు టీంలుగా ఏర్పడి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన పత్రాలను అక్కడికక్కడే అందజేస్తామని వివరించారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా గంగుల జన్మదిన వేడుకలు

ఆళ్లగడ్డ: శాసనమండలి మాజీ విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు, అధికారుల సమక్షంలో మాజీ ఎమ్మెల్సీ భారీ కేక్ కట్ చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి నాయకులు భారీ సంఖ్యలో హాజరై ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీలు గజ్జల రాఘవేంద్రారెడ్డి, వసీం, నాయకులు నాయబ్‌రసూల్, సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, నజీర్ తదితరులు ఉన్నారు.

శిరివెళ్ల: మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు మండలంలో ఆదివారం ఘనంగా జరిగాయి. సర్పంచ్‌లు, గంగుల అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మాజీ వక్ఫ్ బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్‌సలాం, సర్పంచ్ సాలమ్మ, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌నాయక్, ఎంపీపీ వసీంనాయక్, రిటైర్డు ఎంఈఓ మహమ్మద్‌బాషా ఆళ్లగడ్డకు వెళ్లి గంగులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి

సర్కారు బడులకు భద్రత

- హైస్కూళ్లలో నైట్ వాచ్‌మెన్‌ల ఏర్పాటు
- జిల్లాలో 190 మంది నియామకం
- మరో 97 మంది నియామకానికి చర్యలు
- రూ.6వేల చొప్పున గౌరవ వేతనం

నంద్యాల(న్యూటౌన్): సర్కారు బడులను తీర్చిదిద్దుతున్న ప్రభుత్వం వాటికి రక్షణ కల్పించాలని జిల్లాలోని 287 పాఠశాలలకు గాను 197 బడులకు నైట్ వాచ్‌మెన్‌లను నియమించింది. అలాగే మిగిలిన 97 పాఠశాలలకు కూడా నియమించనుంది. వీరికి ప్రభుత్వం రూ.6వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తుంది. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో అభివృద్ధి చేసిన పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్‌లను నియమించింది. అనుసరించాల్సిన విధి విధానాలపై పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలను జారీ చేసింది.

మార్గదర్శకాలు..

- పాఠశాల పేరెంట్ కమిటీల ద్వారా నైట్‌వాచ్‌మెన్ నియామకం ఉంటుంది.
- పాఠశాలలో పని చేస్తున్న ఆయా, కుక్ భర్తలకు ప్రాధాన్యత ఇస్తారు.
- మాజీ సైనికులకు రెండో ప్రాధాన్యత ఉంటుంది.
- 60ఏళ్ల వయస్సు కలిగి ఉండాలి. ఎంపికైన నైట్ వాచ్‌మెన్‌లకు గౌరవ వేతనం ఆయా పాఠశాలల టాయిలెట్ నిర్వహణ ఫండ్ కింద చెల్లిస్తారు.

వాచ్‌మెన్ విధులు ఇలా..

- పాఠశాల ముగిసే ముందుగానే హాజరు కావాలి
- పాఠశాల వద్ద అన్ని రోజుల్లో విధులు నిర్వహించాలి.
- పాఠశాల ఆస్తికి ఎలాంటి నష్టం కలుగకుండా పని చేయాలి.
- ఎక్కడైనా అసాధారణ కార్యకలాపాలు జరిగినప్పుడు స్కూల్ హెచ్‌ఎం, పోలీసు స్టేషన్, అగ్నిమాపక విభాగాలకు సమాచారం అందించాలి.
- ఆర్వో ప్లాంట్‌ను శుభ్రం చేయడం, మొక్కలకు నీరు పోయడం వంటి పనులు చేయాలి.

జిల్లాలో ఎంపికైన పాఠశాలలు, వాచ్‌మెన్ల సంఖ్య..

మండలం	పాఠశాలలకు ఎంపికైన వాచ్‌మెన్ల సంఖ్య
ఆళ్లగడ్డ	8
ఆత్మకూరు	8
బనగానపల్లె	12
బండిఆత్మకూరు	7
బేతంచెర్ల	10
చాగలమర్రి	6
డోన్	9
దొర్నిపాడు	3
గడివేముల	4
గోస్పాడు	3
జూపాడుబంగ్లా	5
కోవెలకుంట్ల	6
కొలిమిగుండ్ల	10
కొత్తపల్లి	5
మహానంది	3
మిడుతూరు	10
నంద్యాల	7
అవుకు	10
పగిడ్యాల	4
పాములపాడు	6
పాణ్యం	6
ప్యాపిలి	11
రుద్రవరం	5
సంజామల	8
శిరివెళ్ల	6
శ్రీశైలం	2
ఉయ్యాలవాడ	5
వెలుగోడు	3
మొత్తం	190

ప్రభుత్వ నిర్ణయం సంతోషకరం



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆస్తుల పరిరక్షణకు నైట్ వాచ్‌మెన్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించడం చాలా సంతోషం. వాచ్‌మెన్‌ల ఏర్పాటుతో హైస్కూళ్లు, మొక్కల పరిరక్షణకు, పాఠశాల సామగ్రికి భద్రత కల్పించిననట్లవుతుంది.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

ఈరోజు

స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సచివాలయాల పరిధిలో పరిష్కారానికి నోచుకోని సమస్యలను మాత్రమే మండల కేంద్రంలో జరిగే స్పందన కార్యక్రమంలో అందజేయాలని కోరారు.

విద్యార్థులకు సన్మానం

ఉయ్యాలవాడ : మండలంలోని జిల్లా పరిషత్, స్థానిక మోడల్‌స్కూల్‌లో జగనన్న ఆణిముత్యాల పురస్కారం కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంఈఓ అనురాధ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని కొండుపల్లె, మాయలూరు, హరివరం, ఉయ్యాలవాడ, బోడెమ్మనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని, స్థానిక మోడల్‌స్కూల్ నుంచి మొత్తం 21 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో తొలి మూడు స్థానాలకు ఎంపికయ్యారన్నారు. వారికి నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను ఆయా పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు అందజేస్తారని చెప్పారు.

జగనన్న సురక్షపై సమీక్ష

ఉయ్యాలవాడ: జగనన్న సురక్ష కార్యక్రమం పటిష్ట అమలుకు ప్రణాళిక కార్యాచరణపై అధికారులతో సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇందుకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, ఇంజినీరింగ్, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు హాజరు కావాలని సూచించారు.

వ్యక్తిపై దాడి

ఆళ్లగడ్డ: పట్టణంలోని చాగలి పామన్నపై భార్గవ అనే వ్యక్తి కత్తితో దాడిచేశాడు. రామలక్ష్మి కొట్టాలకు చెందిన పామన్న మేదర వీధికి చెందిన భార్గవకు జీవాలు విక్రయించాడు. దీనికి సంబంధించి కొంత మొత్తం బాకీ ఉండటంతో పామన్న ఆదివారం భార్గవ ఇంటికి వెళ్లి డబ్బులు అడగగా ఇద్దరి మధ్య వాగ్వాదం చేటుచేసుకుంది. దీంతో భార్గవ కత్తితో పామన్నపై దాడి చేయగా స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు.

విజయవంతం చేయాలి

ఆళ్లగడ్డ: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్, తహసీల్దార్ హరినాథరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఆదివారం 'జగనన్న సురక్ష' పై శిక్షణ తరగతులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి వచ్చే నెల 23వ తేదీ వరకు ప్రతి గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు సమన్వయంతో ప్రతి ఇంటికీ వెళ్లి కార్యక్రమం గురించి వివరించాలని చెప్పారు. ధ్రువ తదితర సర్టిఫికెట్ల జారీలో ఏవైనా సమస్యలు తెలుసుకోవాలని సూచించారు.

జగనన్న పాలనతో సంతోషంగా ప్రజలు



బుగ్గ రస్తాలో లబ్ధిదారుకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సచివాలయం–2 పరిధిలోని పెద్దమకానం, బుగ్గ రస్తా వీధుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వర్షం కురుస్తున్నప్పటికీ ఇంటింటికీ తిరిగి పథకాల అమలు, పొందిన లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాబలం ఉన్న జగనన్న రాజకీయంగా ఏమీ చేయలేక ప్రజలపై కక్ష తీర్చుకునేందుకు ప్రతిపక్షాలు కుట్రపన్నుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలతో పేదలు వృద్ధిలోకి వస్తే తమ మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని, పథకాలు అందకుండా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. పేదలకు ఇళ్లు అందకుండా, స్థలాలు పొందకుండా కోర్టుల్లో కేసులు వేయడం, అభివృద్ధి పనులను అడ్డుకోవడం ఇందులో భాగమేనని చెప్పారు. ఎవరు ఎన్ని విధాలుగా యత్నించినా జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ప్రజలే ముందుండి గెలిపించి నూతన చరిత్ర సృష్టిస్తారని తెలిపారు. మునుపెన్నడూ లేని విధంగా జగనన్న తరపున ప్రజలే ప్రచారం చేస్తారన్నారు. షేక్ బాబులాల్, కుమార్‌రెడ్డి, గణేష్ రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, ఉప సర్పంచ్ షేక్ మహమ్మద్ సోహెల్, మండల కో ఆప్షన్ సభ్యుడు జె.ఇబ్రహీం, ఎంపీటీసీలు లక్ష్మీరెడ్డి, మల్లా రెడ్డి, ఫయాజ్, ముల్లా ఖాదర్‌బాషా, ఖాజాహుసేన్, చక్రం ముల్లా షబ్బీర్, ముల్లా షఫి పాల్గొన్నారు.

'జేఈఈ'లో ప్రతిభ చూపిన టైలర్ కుమారుడు

శిరివెళ్ల: మండలంలో యర్రగుంట్ల గ్రామానికి చెందిన టైలర్ షేక్ నబిరసూల్ కుమారుడు షేక్ ఆసీఫ్ ఆదివారం ప్రకటించిన జేఈఈ మెయిన్ ఫలితాల్లో ప్రతిభ చూపి ఆలిండియా లెవెల్‌లో 924వ ర్యాంకు సాధించాడు. ఆసిఫ్ 2021లో పదవ తరగతి స్వగ్రామంలో చదివి 600కు 596 మార్కులు సాధించాడు. ఇంటర్ గుంటూరులోని ఎస్‌కే కళాశాలలో చదివాడు. నబి రసూల్, మాలంబీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. చిన్నప్పటి నుంచి కుమారుడు చదువులో రాణించాడు. ఉత్తమ ర్యాంక్ సాధించినందుకు ర్పంచ్ సుభాన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతాపరెడ్డి, కృష్ణారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌నాయక్, ఎంపీపీ అభినందనలు తెలిపారు.



కుమారుడు ఆసిఫ్‌కు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

బండిఆత్మకూరులో భారీ వర్షం

మహానంది: బండిఆత్మకూరు మండల పరిధిలో ఆదివారం సాయంత్రం భారీవర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల పరిధిలోని లోతట్టు కాలనీల్లో జలమయమయ్యాయి. పార్నపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీరు అధికంగా చేరడంతో పేదల ఇళ్లల్లోకి వర్షపునీరు చేరింది. దీంతో నిత్యావసరవస్తువులు, ఆహారధాన్యాలు తడిసిపోయాయని పార్నపల్లెకు చెందిన ప్రజాపతి కుమారి, కనకరాజు, బాలనరసమ్మలు ఆవేదన వ్యక్తం చేశారు. పలు గ్రామాల పరిధిలో విద్యుత్‌స్తంభాలు నేలకొరిగినట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

తగ్గని భానుడి సెగలు

- జూన్‌లోనూ మే నెలను తలపిస్తున్న ఎండలు



ఎండకు తట్టుకోలేక గొడుగు నీడన బిడ్డతో కలిసి వెళ్తున్న ఓ తల్లి

దొర్నిపాడు: సాధారణంగా జూన్ మాసం వచ్చిందంటే భానుడి భగ భగలు కాస్త తగ్గుతాయి. నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన తరువాత సూర్యుడు పూర్తిగా శాంతిస్తాడు. అయితే ఈ ఏడాది జూన్ మాసం మూడో వారం గడుస్తున్నప్పటికీ ఎండలు తగ్గడంలేదు. ఉష్ణోగ్రతలు, ఉక్కపోత, వడగాడ్పులు మే నెలను తలపిస్తున్నాయి. దీంతో జనం బయటకు రావడానికి జంకుతున్నారు. గత ఐదు రోజులుగా జిల్లాలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అలాగే రాత్రి పూట కనిష్ట ఉష్ణోగ్రతలు 29 నుంచి 31 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి.

మరో ఐదురోజులు ఇలానే..

ఎండలు, వేడిగాలులు మరో ఐదురోజులు ఉంటాయని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రతి ఏడాది రాజస్థాన్ నుంచి వేడిగాలులు బలంగా వీస్తాయని, వీటి ప్రభావంతో మన ప్రాంతంలో వీస్తాయని, ఈ సారి ఉత్తర, పశ్చిమ దిశగా నుంచి వేడిగాలులు మన వైపు రావడంతోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఉత్తరాదిని ప్రభావితం చేసిన బిపర్‌జాయ్ తుపాన్ ప్రభావం మనకు రావాల్సిన రుతువపవనాల మీద పడినట్లు చెబుతున్నారు.

గత ఐదురోజులుగా నమోదైన జిల్లాలో ఉష్ణోగ్రత వివరాలు..

తేది	కనిష్ట	గరిష్ట
17	29.2	40.5
16	29.4	41.3
15	29.2	41.5
14	28.9	40.2
13	28.8	40.7

వైద్యులను సంప్రదించాలి



ఎండ తీవ్రతలు తగ్గనందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వడ దెబ్బ లక్షణాలు ఏమాత్రం ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలి. లేదంటే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రతి అరగంటకు ఒకసారి నీరు తాగాలి. మూత్రవిసర్జన ఎప్పటికప్పుడు చేస్తూ ఉండాలి. స్థానిక పీహెచ్‌సీలో అన్ని సదుపాయాలు ఉన్నాయి.

– డాక్టర్ నాగేంద్ర, పీహెచ్‌సీ, దొర్నిపాడు

నాడు..ప్రగల్బాలతో సరి.. నేడు.. చేతల్లో చూపి

దొర్నిపాడు: 2019 ఎన్నికలకు ముందు దొర్నిపాడు– అర్జునాపురం రహదారి శిథిలమైన రోడ్డు స్థానంలో కొత్త రోడ్డు వేయిస్తానని నాటి మంత్రి అఖిలప్రియ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి నూతన రోడ్డు వేయించి సమస్య పరిష్కరిస్తామంటూ ప్రగల్బాలు పలికారు. ఆ తరువాత పట్టించుకోలేదు. అయితే ప్రజలకు రహదారి సమస్య మాత్రం కొనసాగింది. ఎంతలా అంటే..వర్షాకాలంలో ఆ దారిలో వెళ్లేందుకు ఏమాత్రం సాధ్యపడేదికాదు. అదుపు తప్పితే కిందపడి గాయాలపాలు కావాల్సిందే. దీంతో అమ్మిరెడ్డినగరం, అర్జునాపురం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమయంలో ఎన్నికల అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చింది. గ్రామస్తుల విన్నపాలకు స్పందించిన ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి 3.6 కి.మీ.రోడ్డుకు రూ.కోటి మంజూరు చేయించారు. రోడ్డు నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించి చేతల్లో చూపారు. దారి కోసం నాలుగేళ్ల ఎదురు చూపులకు మోక్షం లభించడంతో రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





నాడు.. గుంతలమయంగా దొర్నిపాడు-అర్జునాపురం దారి, నేడు తారు రోడ్డుగా మారిన దృశ్యం